సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం, 16, జూలై, 2024



విశాఖలో 'పేకమేడలు' సందడి

పేకమేడలు సినిమా యూనిట్ విశాఖలో సందడి చేసింది. హీరోహీరోయిన్లు వినోద్ కిషన్, అనూష మీడియాతో మాట్లాడారు. 8లో



257 అర్జీలు 8లో

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గిరిజనుల సమస్యలపై 257 అర్జీలు వచ్చాయి. వీటిని కలెక్టర్ స్వీకరించారు.



గర్భిణికి డోలీమోత

గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో డోలీమోతలో 2 కిలోమీటర్ల మేర తీసుకెళ్లారు. 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. 8లో

న్యూస్‌రీల్

ఉత్తమ ఫలితాలతో ఉన్నత అవకాశాలు

చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



విద్యార్థిని ఆదిలక్ష్మికి పారితోషికం అందచేస్తున్న పీవో చైతన్య

చింతూరు: డివిజన్ నుంచి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆకాంక్షించారు. చింతూరు డివిజన్ పరిధిలో ఇటీవల ట్రిపుల్ ఐటీకి ఎంపికైన నలుగురు విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవోను కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రూ.2 వేల చొప్పున పారితోషికం అందజేశారు. పీవో మాట్లాడుతూ తాను కూడా ట్రిపుల్ ఐటీలోనే విద్యనభ్యసించి ఈ స్థాయికి ఎదిగానని, దీని ద్వారానే చాలా మంది పెద్ద ఉద్యోగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా చింతూరు మండలానికి చెందిన వేలు వసుంధర, పండా ఆదిలక్ష్మి, కూనవరం మండలానికి చెందిన హర్షిత, నవ్యలను వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను పీవో అభినందించారు.

వ్యవసాయ కనెక్షన్ కోసం 1912కి కాల్ చేయండి

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



సాక్షి, విశాఖపట్నం: కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావల్సిన రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయవచ్చని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని వివిధ మీ–సేవా కేంద్రాలు, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. ఈ కార్యాలయాల్లో కొత్త వ్యవసాయ కనెక్షన్ల నమోదు సమయంలో పత్రాలను అప్‌లోడ్ చేసే సమయంలో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. అందుకే రైతులు నేరుగా ఏపీఈపీడీసీఎల్ కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రైతులు తమ ఆధార్ నంబర్, రిజిస్టర్డ్ ఫోన్ నంబర్, పట్టాదార్ పాస్ బుక్ నంబర్, సర్వే నంబర్, వాల్టా సర్టిఫికెట్ నంబర్, కులధృవీకరణ పత్రం వంటి వివరాలను తెలియచేయాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావలసిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల పరిధిలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అధికారుల చొరవతో విద్యార్థికి తప్పిన ప్రాణాపాయం

మెదడులో రక్తం గడ్డకట్టడంతో కేజీహెచ్‌లో న్యూరో సర్జరీ



ఆపరేషన్ థియేటర్లో సందీప్

కొయ్యూరు: అధికారులు సకాలంలో స్పందించడంతో స్థానిక గురుకుల పాఠశాలలో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థి టి. మోహన్ ప్రేమ్‌సందీప్‌కు ప్రాణాపాయం తప్పింది. సోమవారం కేజీహెచ్‌లో వైద్యులు సదరు విద్యార్థికి న్యూరో సర్జరీ శస్త్రచికిత్సను విజయవంతంగా చేశారు. సందీప్ తరుచుగా కళ్లు తిరిగి పడిపోయేవాడు. దాంతో నాలుగు రోజుల క్రితం కొయ్యూరు వైద్యులకు చూపించగా, వారి సూచన మేరకు రెండు రోజుల క్రితం కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ సిటీ స్కాన్, ఎమ్మారై చేయించారు. అతడి మెదడులో రక్తం గడ్డకట్టిన విషయాన్ని గుర్తించారు. ఈ మేరకు శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు నిర్ధారించారు. ఈ విషయమై ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ ఆదివారం పీవో అభిషేక్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి కేజీహెచ్ వైద్యులతో మాట్లాడారు. ఆ మేరకు సందీప్‌కు న్యూరో శస్త్ర చికిత్స చేశారు. దీనిపై ఏటీడబ్ల్యూవో మాట్లాడుతూ విద్యార్థి ఆరోగ్యంగా ఉన్నాడని వైద్యులు తెలిపారన్నారు. వారం రోజుల విశ్రాంతి అనంతరం తరగతులకు హాజరు కావచ్చని సూచించారన్నారు. ఐటీడీఏ పీవో సహకారంతో వైద్యులు చికిత్స చేశారని కృతజ్ఞతలు తెలిపారు.

భృతి ఓ బూటకం

- ఇంటికో ఉద్యోగమంటూ ఊదరగొట్టిన చంద్రబాబు
- లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ
- నెల రోజులు దాటినా ఊసెత్తని వైనం
- అల్లూరి జిల్లాలో 2 లక్షల మంది నిరుద్యోగులు
- నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ కోసం ఎదురుచూపులు

సాక్షి, విశాఖపట్నం/పాడేరు: అధికారంలోకి రాకముందు ఒక మాట.. వచ్చిన తర్వాత మరో మాట.. ఇదీ చంద్రబాబు నైజం. ఎన్నికల ముందు ఒట్టేసి ఒక మాట.. ఒట్టెయ్యకుండా ఒక మాట చెప్పడు ఈ ఛత్రపతి అన్న రేంజ్‌లో.. నోటికొచ్చిన హామీలిచ్చి.. వాటిని తుంగలో తొక్కడం.. లేదంటే.. నిబంధనల చట్రంలో బందీలుగా మార్చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. తల్లులందరికీ వందనమంటూ వంగి వంగి నమస్కారాలు పెట్టిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక.. ఒక్క తల్లికే వందనమంటూ మాట మార్చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగం లేదా.. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పడంతో ఎదురుచూపులు చూస్తున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమవుతోంది. అసలు భృతి ఇస్తారా ఇవ్వరా అనే సందేహాలు కూడా తలెత్తుతున్నాయి.



'ఎవరికైనా ఉద్యోగాలొచ్చాయా తమ్ముళ్లూ..? రాలేదు కదా.. కొంతమందికి ఉద్యోగాలిచ్చారు.. మూటలు మోసే ఉద్యోగం.. అవీ ఒక ఉద్యోగాలేనా.? నేను సీఎం అయిన వెంటనే.. ఇంటికో ఉద్యోగమిస్తా.. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు అందిస్తాను.. ఎవరూ భయపడొద్దు.. బాబు వస్తే.. ఇంటింటికీ జాబొస్తాదీ...''

– ఎన్నికల ప్రచార సమయంలో ఎక్కడికెళ్లినా.. చంద్రబాబు ఊదరగొట్టిన ప్రసంగమిదీ.

2014లోనూ అదే అబద్ధం

2014 ఎన్నికల్లోనూ అదే అబద్ధంతో చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. నాలుగున్నరేళ్ల పాటు సాగదీసిన తర్వాత.. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో తెరపైకి తీసుకొచ్చారు. తొలుత ఇంటింటికీ ఉద్యోగం.. లేకుంటే ప్రతి నిరుద్యోగికి రూ.2 వేల భృతి అని ప్రకటించి.. చివరికి రూ.1000 మాత్రమే ఇస్తామన్నారు. పోనీ.. అదైనా నిరుద్యోగులందరికీ సక్రమంగా ఇచ్చారా అంటే.. అందులోనూ రోజుకో కొత్త నిబంధన తీసుకొచ్చి.. నిరుద్యోగులకు ముచ్చెమటలు పట్టించారు. కుటుంబంలో ఎవరికీ ప్రభుత్వ ఉద్యోగం ఉండకూడదనీ, రూ.50 వేలకు మించి రుణం ఉండకూడదంటూ సవాలక్ష ఆంక్షలు విధించారు. ఈ కారణంగా అనేక మంది నిరుద్యోగులకు ఈ పథకం అందని ద్రాక్షగానే మారింది. క్రమంగా వివిధ కారణాల సాకులతో నిరుద్యోగులను భృతి జాబితా నుంచి తొలగించడంతో అందరి ఆశలూ గల్లంతయ్యాయి.



నెల గడిచినా ఊసెత్తని సర్కారు..!

మరోసారి ఇంటికో ఉద్యోగం లేదంటే నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటుతున్నా.. దీనిపై కనీసం సమీక్ష చేయడం గానీ.. అధికారులకు ఆదేశాలు జారీ చేయడంగానీ జరగలేదు. జిల్లాలోని 22 మండలాల పరిధిలో 2,33,759 కుటుంబాలు ఉన్నాయి. టెన్త్, ఇంటర్‌తోపాటు, డిగ్రీలు, డీఎడ్, బీఈడీ, ఇంజనీరింగ్, నర్సింగ్, ఇతర ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులు కుటుంబానికి ఒక్కరు చూసుకున్న సుమారు 2 లక్షల మంది ఉంటారు. వీరిలో చాలామంది నిరుద్యోగులు ప్రభుత్వ ఉపాధి కల్పన, శిక్షణ కార్యాలయాల్లో మాత్రం తమ వివరాలను నమోదు చేసుకోలేదు. వీరందరికీ రూ.3 వేలు చొప్పున ప్రతి నెలా నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంటుంది. అంటే.. ప్రతి నెలా జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు రూ.60 కోట్లుకు పైగానే భృతి అందించాలి.

2014-19లో ఉమ్మడి విశాఖ జిల్లాలోని నిరుద్యోగులను మోసం చేసిందిలా...

వెబ్‌సైట్‌లో నిరుద్యోగుల దరఖాస్తులు
11,67,179

ఓటీపీ జనరేట్ అయిన వారు
1,03,011

భృతికి అర్హత సాధించిన నిరుద్యోగులు
35,818

ఫిబ్రవరి 2019లో భృతి పొందిన నిరుద్యోగులు
28,383

మార్చిలో భృతి పొందిన నిరుద్యోగులు
28,495

వైఎస్సార్‌సీపీ హయాంలో ఉద్యోగాల వెల్లువ

2019–24 మధ్య కాలంలో ఉద్యోగాల జాతరే జరిగింది. అల్లూరి జిల్లాలో 352 గ్రామ సచివాలయాలున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూరు శాతం రిజర్వేషన్ ప్రకారం గిరిజనులకు స్థానిక ఉద్యోగాలు కల్పించింది. ప్రతి సచివాలయానికి 10 ఉద్యోగాలు చొప్పున 3,520 మంది గిరిజన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించారు. నెలకు రూ.5 వేల గౌరవ వేతనంతో 15 వేల మందిని వలంటీర్లుగా నియమించారు. ఇలా ఐదేళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ సొంతం చేసుకుంది.

ఇంటికో ఉద్యోగం వస్తుందా.?

నిరుద్యోగ భృతి లేదంటే ఇంటికో ఉద్యోగం ఇస్తానంటూ చంద్రబాబు హామీ ఇచ్చారు. జిల్లాలో మొత్తం ఇళ్ల సంఖ్యను బట్టి రెండు లక్షల మందికిపైగా ఉద్యోగాలు కూడా ఇవ్వాల్సి ఉంది. కానీ గతంలో ఉద్యోగమంటూ ఊదరగొట్టి అందరికీ మొండిచెయ్యి చూపించిన చంద్రబాబు.. ఈసారీ అదే వైఖరి అవలంబిస్తారేమోనంటూ నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హామీలను నమ్మి ప్రతిసారీ చంద్రబాబు ప్రభుత్వం చేతిలో మోసపోతున్నామంటూ వాపోతున్నారు.

ఉపాధి కల్పన, శిక్షణ కార్యాలయంలో నిరుద్యోగుల వివరాలు

విద్యార్హత	మేలు	ఫిమేల్	మొత్తం
1 నుంచి 9	1,032	581	1613
టెన్త్	10,133	7,465	17,598
ఇంటర్	7,784	3,753	11,537
డిగ్రీ	3,835	1,573	5,408
మొత్తం	22,784	13,372	36,156

భృతి లేదా ఉద్యోగాలు ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించాలి. లేదా ప్రకటించినట్లు ప్రతి నెలా మా వంటి నిరుద్యోగులకు భృతి ఇవ్వాలి. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రధానంగా నిరుద్యోగులకు భృతి కల్పిస్తామని హామీలు ఇచ్చింది. ఆ మేరకు నేటికీ విధి విధానాలను ప్రకటించక పోవడం నిరుద్యోగులను ఏమరపాటుకు గురిచేయడమే అవుతుంది. ఇకనైనా భృతి లేదా ఉద్యోగం ఎప్పుడిస్తారో వెంటనే ప్రకటించాలి.

–ఈగల గంగాధర్, బీకాం, రాజవొమ్మంగి

నిరుద్యోగ భృతి ఏదీ?



నిరుద్యోగులకు భృతి కల్పిస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చి ఇప్పుడు నెలలు, వారాలు గడుపుతున్నారు. ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పి నిరుద్యోగులను మోసం చేశారు. ఉవ్వాసింగి పంచాయతీ తియ్యగుండం గ్రామం, వయస్సు 39 సంవత్సరాలు. ఎన్నికల వాగ్దానంతో నిరుద్యోలకు ఆశలు కల్పించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఉద్యోగం వస్తుందని ఎంతో ఆశతో ఉన్నాను. అది లేకపోతే నిరుద్యోగ భృతి అయినా వస్తుందని సంతోషించాను. కాని ఇప్పటి వరకు చంద్రబాబు దాని ఊసేత్తకపోవటం విచారకరం.

–సూకూరు నీలకంఠం, బీఎస్సీ, బీఈడీ, నిరుద్యోగి, తియ్యగుండం, జి.మాడుగుల మండలం

గతంలో మాదిరిగా మోసం చేయొద్దు



నిరుద్యో గులకు ప్రతి నెలా రూ. 3 వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ భృతిపై ఊసెత్తలేదు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని మాట తప్పారు. ప్రస్తుతం ఎప్పటి నుంచి నిరుద్యోగ భృతి ఇస్తారో ప్రకటించాలి. ప్రతి నెలా రూ. 3 వేలు చెల్లించాలి.

– పాంగి యోబు, బీఏ స్పెషల్ తెలుగు, గంగగుడ్డి గ్రామం, మాడగడ పంచాయతీ, అరకులోయ మండలం

ఎస్పీగా అమిత్ బర్దర్ బాధ్యతల స్వీకరణ

గంజాయి నిర్మూలనకు ప్రణాళిక



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ అమిత్‌బర్దర్

పాడేరు: నూతన ఎస్పీగా అమిత్ బర్దర్ సోమవారం సాయంత్రం జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్పీగా పని చేసిన తుహిన్ సిన్హాను రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నం డీసీపీ–2గా బదిలీ చేసింది. ఆ స్థానంలో అమిత్ బర్దర్‌ను నియమించింది. ముందుగా ఆయన మోదకొండమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి నేరుగా పోలీస్ శాఖ కార్యాలయానికి చేరుకున్న ఆయన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి గౌరవ వందనం చేశారు.



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ

అనంతరం తన కార్యాలయంలో జిల్లా మూడో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీని పాడేరు ఏఎస్పీ ధీరజ్, స్పెషల్ బ్రాంచి సీఐ హిమగిరి, పాడేరు సీఐ నవీనకుమార్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూస్తానని, ప్రధానంగా ప్రభుత్వం నిర్దేశించిన వంద రోజుల గంజాయి నిర్మూలన ప్రణాళికను పకడ్బందీగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.

462.8 మిల్లీమీటర్ల వర్షపాతం

సాక్షి, పాడేరు: జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. సోమవారం జిల్లా వ్యాప్తంగా 462.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ముంచంగిపుట్టులో 122.4, పెదబయలులో 80.8 మిల్లీమీటర్ల మేర వర్షం పడింది. పాడేరులో 43.8, జి.కె.వీధిలో 43.2, కొయ్యూరులో 31.8, మారేడుమిల్లిలో 19, డుంబ్రిగుడలో 18.4, రాజవొమ్మంగిలో 13.8, అడ్డతీగలలో 9.2, రంపచోడవరంలో 8.6, వై.రామవరంలో 8.6, గంగవరంలో 7.4, అరకులోయలో 7.6, అనంతగిరిలో 5.4, దేవిపట్నంలో 5.2, జి.మాడుగులలో 8.2, గంగవరంలో 7.4, చింతపల్లిలో 4.2, చింతూరులో 4.6, కూనవరంలో 2.8, వి.ఆర్.పురంలో 1.4, ఎటపాకలో 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రైతులకు పెట్టుబడి సాయం విడుదల చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

పాడేరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాదిరిగానే ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు రైతులకు వ్యవసాయ పెట్టుబడి సాయం రూ.20 వేలను తక్షణమే అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం పాడేరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు వ్యవసాయం చేసుకునేందుకు పెట్టుబడి సాయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కొంతమంది రైతులు దళారుల వద్ద అప్పులు చేసి సాగు కోసం పెట్టుబడి పెడుతున్నారన్నారు. మిగిలిన రైతులకు పెట్టుబడి సాయం లేక ఈ ఏడాది వ్యవసాయానికి దూరమయ్యారని చెప్పారు. గత ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతు భరోసా పథకాన్ని అమలు చేసిందన్నారు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయంపై నేటికీ ప్రకటన చేయకపోవడం సరికాదన్నారు. తక్షణమే స్పందించి రైతులకు సాయాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా నాయకురాలు భీమలమ్మ, సింహాచలం, చంటిబాబు, అమర్, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం



అరకు ఎంపీని సత్కరిస్తున్న గిరిజన సంఘాల ప్రతినిధులు

అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి

డాబాగార్డెన్స్: గిరిజనుల అభివృద్ధికి శక్తివంచన లేకుండా తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి తెలిపారు. ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన పాడేరు, అరకు ఎమ్మెల్యేలు, అరకు ఎంపీని నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం గిరిజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ తనూజారాణి మాట్లాడుతూ గిరిజనులకు నష్టం కలిగించే జీవో 3పై పార్లమెంట్‌లో చర్చించి గిరిజనాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మైదాన ప్రాంతాల నుంచి వచ్చి వ్యాపారులు, ఇతర ప్రాంతాల వారు అధికంగా ఉన్నారని, వారి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంత అభివృద్ధికై అసెంబ్లీలో అన్ని అంశాలపై చర్చించి ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. అనంతరం వచ్చే నెల 9న నిర్వహించనున్న ప్రపంచ గిరిజన దినోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. గిరిజన సంఘాల ప్రతినిధి లకే చిట్టిబాబు, విశాఖ జిల్లా గిరిజన ఐక్యవేదిక ముఖ్య సలహాదారుడు కె.రామారావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు కొక్కుల రామారావు, ఆత్మతృప్తి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు అంబిడి రాజయ్య, గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చిత్తయ్య, బహుజన టీచర్స్ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, గిరి జాగృతి సంఘం అధ్యక్షుడు మోరి సింహాచలం, జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు అంబటి కోటేశ్వరరావు, స్టీల్‌ప్లాంట్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకుడు తౌడన్న పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

కలెక్టర్ దినేష్‌కుమార్



పోలవరం నిర్వాసితులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం: పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన అర్హులందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు పరిచే విధంగా తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులతో కలెక్టర్, జేసీ భావన వశిష్ట, పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, పోలవరం స్పెషల్ కలెక్టర్ సరళ వందన సమావేశమయ్యారు. ముందుగా పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితుల సమస్యలు తెలుసుకున్నారు. భూమికి భూమికి, డీ పట్టాలకు నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ కాలనీలలో బాత్‌రూమ్‌ల నిర్మాణం, 18 ఏళ్లు నిండిన వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు తదితర సమస్యలను కలెక్టర్ దృష్టికి ముంపు బాధితులు తీసుకొచ్చారు. వీటిపై ఆయన స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయుటకు గ్రామాల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో 44 గ్రామాలు పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురయ్యాయని తెలిపారు. నిర్వాసితులకు భూమికి భూమి సమస్యలు పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు ఆర్అండ్ఆర్ కాలనీలను పంచాయతీలుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్

రంపచోడవరం ఏరియా ఆస్పత్రిని కలెక్టర్ దినేష్‌కుమార్ సోమవారం రాత్రి సందర్శించారు. ఇక్కడ వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. అంతకు ముందు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది కలెక్టర్‌ను కలిసి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు కె. లక్ష్మిపై ఫిర్యాదు చేశారు. ఆమె వేధింపుల పర్వం నుంచి రక్షణ కల్పించాలని కోరారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. దీంతో కలెక్టర్ అక్కడ వైద్యులు, సూపరింటెండెంట్, సిబ్బందితో మాట్లాడారు. ఆస్పత్రిలో పరిస్థితులను చక్కదిద్దేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



సమస్యలు తెలుపుతున్న నిర్వాసితులు

సూపర్ సిక్స్ ఊసెత్తని చంద్రబాబు

- ముందు ఎన్నికల హామీలు అమలు చేయండి
- ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి





అడ్డతీగల: ఎన్నికల సమయంలో బూటకపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు ఇప్పుడు సూపర్ సిక్స్ ఊసెత్తడం లేదని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అన్యాయంగా కేసులు పెట్టి పైశాచిక ఆనందం పొందడం కాదని, ముందు సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేల చొప్పున ఇస్తానని చెప్పి, ఇప్పుడు తల్లికి వందనం పథకం అమలులో దగా చేస్తున్నారన్నారు. ఈ పథకంలో లబ్ధి కావాలంటే ఆధార్‌తో లింక్ కోసమే జీవో ఇచ్చామని చెప్పడం ఒక పెద్ద జోక్ అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి పథకాన్ని ఆధార్‌తో లింక్ చేస్తూ అర్హులైన ఏ ఒక్కరూ మిస్ కాకుండా పూర్తి పారదర్శకంగా అమలు చేసిందన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా నాలుగేళ్ల పాటు అమ్మఒడి నగదు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. ఈ పథకానికి కాపీ తల్లికి వందనం అన్నారు. పిల్లల తల్లులందరికీ పంగనామాలు పెడుతూ మరోసారి పచ్చిగా మోసం చేసేందుకు సిద్ధమయ్యారన్నారు.

రాజకీయ కక్షతోనే మాజీ సీఎం జగన్‌పై కేసు

మూడేళ్ల క్రితం సుప్రీం కోర్టు తప్పు పట్టినా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అన్యాయంగా కేసులు పెట్టారని ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి విమర్శించారు. అప్పటి ఎంపీ రఘురామకృష్ణంరాజు ఫిర్యాదులో వాస్తవం లేదని కేసు కొట్టివేసిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షతో కేసు తిరగదోయడం దారుణమన్నారు. ఈ కేసుతో పోలీసులు కొత్త సాంప్రదాయానికి తెర తీశారని, ఇది ఏ మాత్రం సమంజసం కాదన్నారు.

క్లుప్తంగా

మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దు



పోశమ్మ గండి వద్ద వరదను పరిశీలిస్తున్న సీఐ

దేవీపట్నం: పోశమ్మ గండి వద్ద గోదావరి వరద ఉధృతంగా ఉండటంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని రంపచోడవరం సీఐ వాసా వెంకటేశ్వరరావు తెలిపారు. ఎస్పీ, ఏఎస్పీ జగదీష్ అడహళ్లి ఆదేశాల మేరకు సోమవారం పోశమ్మ గండి వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. పోశమ్మగండికి వచ్చే భక్తులు గోదావరిలో స్నానానికి దిగవద్దని, సెల్ఫీలు కోసం బయట వ్యక్తులు రావొద్దని సూచించారు. సీఐ వెంట దేవీపట్నం ఎస్సై నాగార్జున సిబ్బంది ఉన్నారు.

ఆటో బోల్తా పడి అంగన్‌వాడీ టీచర్ మృతి



కళావతి(ఫైల్)

హుకుంపేట: ఆటో బోల్తా పడిన సంఘటనలో అంగన్‌వాడీ టీచర్ మృతి చెందారు. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండలంలోని ఓల్డా పంచాయతీ జాంకరంపుట్టు గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న బడ్నైని కళావతి(45) ఆమె రెండవ కుమార్తెకు ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించేందుకు ఆటోలో వెళ్తుండగా గడుగుపల్లి గ్రామం వద్ద ప్రమాదవశాత్తు వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కళావతి ఘటన స్థలంలో మృతి చెందగా, మరో వ్యక్తి లక్ష్మయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదాన్ని గుర్తించిన సమీప గ్రామస్తులు గాయపడిన వ్యక్తికి 108 సమాచారం అందించి పాడేరు జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తుప్పల్లో శిశువు మృతదేహం

పరవాడ: దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్ కాలనీ సమీపంలో సోమవారం సాయంత్రం మగ శిశువు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పరవాడ పోలీసులకు సమాచారం అందించారు. పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు అందించిన వివరాల ప్రకారం..అప్పుడే పుట్టిన మగ శిశువు మృతదేహాన్ని సాయినగర్‌కాలనీ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు తుప్పల్లో విసిరి వెళ్లిపోయారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాలసూర్యారావు చెప్పారు.

గర్భిణికి డోలీమోత

- పురిటినొప్పులతో అవస్థలు
- మగ బిడ్డకు ప్రసవం
- ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రికి తల్లీ బిడ్డల తరలింపు
- పరిస్థితి విషమంగా ఉండడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి సిఫార్సు చేసిన వైద్యులు



హోరు వర్షంలో డోలీలో గర్భిణిని తీసుకెళ్తున్న కుటుంబసభ్యులు



కొడుకు సందీప్‌కుమార్‌ను ఎత్తుకొని వస్తున్న తండ్రి సహదేవ్

పెదబయలు: మండలంలోని రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జామిగుడ పంచాయతీ పినరావెల గ్రామానికి చెందిన కొర్ర మైథిలి(25)కు సోమవారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో భర్త కొర్ర నాగేశ్వరరావు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. గ్రామం వరకు రావడానికి రోడ్డు లేదని సాకిరేవు వరకు తీసుకునిరావాలని అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. దీంతో గత్యంతరం లేక గ్రామం నుంచి సుమారు 2 కిలోమీటర్లు వర్షంలో డోలీమోతతో తరలిస్తుండగా పురిటినొప్పులు ఎక్కువై మార్గమధ్యలో మగబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో తల్లీ, బిడ్డలను డోలీపై సాకిరేవు గ్రామం వరకు తీసుకెళ్లి, అక్కడ నుంచి 108 వాహనంలో ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి తల్లిబిడ్డలను వైద్యులు సిఫార్సు చేశారు. అక్కడి వైద్యులు చికిత్స అందిస్తున్నట్టు తెలిసింది.

భూసిపుట్టు కేంద్రంగా పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి

పెదబయలు మండలంలోని జామిగుడ, గిన్నెలకోట,ముంచంగిపుట్టు మండలం భూసిపుట్టు శివారు పంచాయతీలకు చెందిన వారు చికిత్స కోసం 25 కిలోమీటర్లు దూరంలో ఉన్న రూడకోట, 45 కిలోమీటర్లు దూరంగా ఉన్న ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రికి తరలించాల్సి వస్తుందని, ఈ మేరకు భూసిపుట్టు కేంద్రంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. భూసిపుట్టు కేంద్రంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని మూడు పంచాయతీ ప్రజలు కోరుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూడకోట నుంచి జామిగుడ వరకు తారురోడ్డు నిర్మాణం జరిగిందని, లేకుంటే అత్యవసర పరిస్థితిలో మరణమే శరణ్యంగా ఉండేదని చెబుతున్నారు. ప్రభుత్వం, కలెక్టర్, ఐటీడీఏ పీవోలు స్పందించి ఆయా శివారు పంచాయతీల ప్రజలకు సమీప ప్రాంతాల్లో వైద్య సేవలు అందేలా చూడాలని స్థానికులు కోరారు. ఈ మేరకు యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ జర్సింగి సూర్యనారాయణ, సర్పంచ్ తెరవాడ అన్నమ్మ గ్రామ పెద్దలు వెంకటరావు, దివాకర్, రాజేష్, కృష్ణమూర్తి కొండలరావు, పద్మ, ప్రభుదాస్ తదితరులు డిమాండ్ చేశారు.

అనారోగ్యంతో ఉన్న కొడుకును 2 కిలోమీటర్లు మోసిన తండ్రి

ముంచంగిపుట్టు: మండలంలో అత్యంత మారుమూల రంగబయలు పంచాయతీ మల్లిపోదర్ గ్రామానికి చెందిన కిల్లో సహదేవ్ తన కొడుకు సందీప్‌కుమార్(8)కు సోమవారం తీవ్రమైన జ్వరంతో ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో తండ్రి ఎత్తుకొని రెండు కిలోమీటర్ల మేర కాలి నడకన రోడ్డు వరకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి వెంటనే స్పందించి లబ్బూరు వైద్యాధికారి శ్యాంప్రసాద్ ఫోన్లో సమాచారం అందించారు. దీంతో బైక్ అంబులెన్స్ పంపించడంతో బాలుడిని లబ్బూరు పీహెచ్‌సీకి తరలించారు. నిత్యం తమ గ్రామ పరిస్థితి ఈ విధంగానే ఉంటుందని, రోడ్డు సౌకర్యం కల్పించాలని మల్లిపోదర్ గ్రామ గిరిజనులు కోరుతున్నారు.

మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు



మెనూ పరిశీలిస్తున్న డీడీ కొండలరావు

ముంచంగిపుట్టు: ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని పాడేరు గిరిజన సంక్షేమ శాఖ డీడీ వై.కొండలరావు తెలిపారు. మండలంలోని జోలాపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక పాఠశాలను సోమవారం ఉదయం 7 గంటలకు ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించిన అల్పాహారం పరిశీలించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం లబ్బూరు, లక్ష్మీపురం వసతి గృహాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని, వర్షాకాలంలో వేడి నీళ్ల తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఆశ్రమాల్లో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అడాల్‌పుట్టు విద్యార్థులకు వాగు కష్టాలు..



అడాల్‌పుట్టు వద్ద పిల్లలను వాగు దాటిస్తున్న తండ్రి

ముంచంగిపుట్టు: మండలంలో దొడిపుట్టు పంచాయతీ అడాల్‌పుట్టు గ్రామ విద్యార్థులకు వాగు కష్టాలు నిత్యం వెంటాడుతున్నాయి. రెండు కిలోమీటర్ల దూరంలో తలబిరాడ పాఠశాల ఉండడంతో గ్రామం నుంచి వచ్చే మార్గంలో వాగును దాటితేనే చదువుకోగలుతున్నారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అడాల్‌పుట్టు గ్రామ సమీపంలో వాగు సోమవారం ఉధృతంగా ప్రవహించింది. దీంతో విద్యార్థులకు వాగు దాటలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వారి తల్లిదండ్రులు సాహసం చేస్తూ పిల్లలను అతికష్టం మీద వాగు దాటించి, పాఠశాలకు తీసుకువెళ్లారు. ప్రతి ఏడాది తమ పిల్లకు వాగు కష్టాలు తప్పడం లేదని, గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించడంతోపాటు వాగు వద్ద కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు, సీఐటీయూ మండల కార్యదర్శి కె. శంకర్‌రావు కోరారు.

తంగేళ్లబంధకు ఉపాధ్యాయుడు నియామకం



తంగేళ్లబంధలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

సాక్షి ఎఫెక్ట్..

అనంతగిరి: మండలంలోని తంగేళ్లబంధ ప్రత్యామ్నాయ పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించినట్లుగా ఎంఈవో కిల్లో బాలజీ సోమవారం తెలిపారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. 'మా పిల్లలకు పాఠాలు చెప్పించండి' అంటూ సోమవారం సాక్షిలో దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మండల విద్యాశాఖ అధికారులు స్పందించారు. కురుస్తున్న వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ దాటి గ్రామం నుంచి 25 మంది విద్యార్థులు గంగవరం ఎంపీపీ పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ పాఠశాల నుంచి ఉపాధ్యాయుడు వీరభద్రరావును పంపించి తొలిరోజు పాఠాలు చెప్పించారు. ఈ సందర్భంగా అధికారులకు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్‌కు అపూర్వ స్వాగతం

కొమ్ము డ్యాన్సు, గిరిజన నృత్యాలతో ఆహ్వానం పలికిన గిరిజనులు



కొమ్ము తలపాగాతో కలెక్టర్ దినేష్‌కుమార్, అధికారులు, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

రంపచోడవరం: గతంలో రంపచోడవరం ఐటీడీఏ పీవోగా పనిచేసిన దినేష్‌కుమార్ తొలిసారిగా కలెక్టర్ హోదాలో ఇక్కడకు రావడంతో గిరిజనులు అపూర్వ స్వాగతం పలికారు. కొమ్ము డ్యాన్సు, గిరిజన నృత్యాలతో ఐటీడీఏ వరకు ర్యాలీగా పూల వర్షం కురిపిస్తూ తీసుకువచ్చారు. ఐటీడీఏ ఎదుట కలెక్టర్ దినేష్‌కుమార్‌కు, పీవో సూరజ్‌గనోరే, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవీ, జేసీ భావన వశిష్ట, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌లకు కొమ్ము తలపాగాలు పెట్టి గౌరవించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏజెన్సీలో పరిస్థితులను బట్టి సేవ చేసిన ఏ అధికారిని గిరిజనులు మరిచిపోరన్నారు. ప్రస్తుతం జిల్లాలో యువ ఐఏఎస్ అధికారులు పనిచేస్తున్నారని, అందరూ టీంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరిచే విధంగా తన వంతు కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు వెదుళ్ల లచ్చిరెడ్డి, మఠం భాస్కర్, జీడీ రామారావు, పులిమెట్ల మోహన్‌రావు, జెడ్పీటీసీ గొర్లె బాలాజీబాబు, బేబీరాణి, నిరంజనీదేవి, కింటుకూరు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 257 అర్జీలు

గిరిజనుల నుంచి స్వీకరించిన కలెక్టర్

రంపచోడవరం: ఏజెన్సీలో గిరిజనుల సమస్యలపై వచ్చిన అర్జీల్లో కొన్ని వెంటనే పరిష్కరించి, మరికొన్ని సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో సోమవారం వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జేసీ భావన వశిష్ట, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ ఎస్ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు. ఈ వారం 257 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు సంబంధించిన రహదారుల సమస్యలు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతోపాటు భూ సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు. వీటితోపాటు రంపచోడవరం మండలంలోని సిరిగిందలపాడు ఇరిగేషన్ ప్రాజెక్టుకు మరమ్మతుల చేయించాలని రైతులు బాపన్న దొర, పండా చెల్లన్నదొర, కోసు రాజన్న దొర దరఖాస్తు అందజేశారు. మారేడుమిల్లి మండలం జీఎంవలస పంచాయతీలోని డోలగండి, నెల్లూరు గ్రామాలకు సంబంధించి ఏడు కిలోమీటర్లు, ఉత్తలూరు గ్రామంలో ఐదు కిలోమీటర్ల మేర మేర బీటీరోడ్డు ఏర్పాటు చేయాలని, జీఎం వలస గ్రామ సచివాలయ భవనం పనులు పూర్తి చేయించాలని సర్పంచ్ కారం లక్ష్మి, పల్లాల చిన్నారెడ్డి, మట్ల సుగ్గి రెడ్డి అర్జీలు సమర్పించారు. మారేడుమిల్లి మండలం పుల్లంగి గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేయాలని సర్పంచ్ వి. జార్జి బాబు దరఖాస్తు అందించారు. గంగవరం మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన గిరిజన రైతుల 500 ఎకరాలకు భూపతిపాలెం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలని, గంగవరం మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన 30 బీటీ రోడ్ల ఏర్పాటు చేయాలని, ఎండపల్లి గ్రామంలోని తాగునీటికి సంబంధించిన వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేశారని, కొన్ని పనులు పూర్తికాక మధ్యలో నిలిచిపోయిందని, వెంటనే పూర్తి చేసి తాగునీరు అందించాలని తీగల ప్రభ, కోసు బుల్లియమ్మ, సారపు సత్యవేణి అర్జీలు అందజేశారు.

రైతును కట్టేసి కోళ్లతో ఉడాయింపు

దూసరపాములో ఘటన



బాధిత రైతు చంటి

రాజవొమ్మంగి: కోళ్లు పెంచుతూ వాటిని అమ్మి జీవనం సాగిస్తున్న రైతును గుర్తుతెలియని వ్యక్తులు తాళ్లతో కట్టేశారు. ఆపై కోళ్లను ఎత్తుకెళ్లిపోయారు. ఈ ఘటన మండలంలోని దూసరపాములో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధితుడు లింగం చంటి కథనం మేరకు.. నలుగురు వ్యక్తులు అతడి పాకలోకి వచ్చి గంజాయి అమ్ముతున్నావా? అంటూ బెదిరించారు. లేదండి.. ఏదో కోళ్లు పెంచుతూ కొద్దిపాటి ఆదాయం పొందుతున్నానని బదులిచ్చాడు. అంతలోనే ఆగంతకులు చంటిని తాళ్లతో బంధించారు. ఆ తర్వాత మఖాంలోని రూ.2 లక్షల విలువైన 40 కోళ్లను ఎత్తుకుని వెళ్లిపోయారు. దీంతో బాధితుడు లబోదిబోమంటూ కేకలు వేస్తూ గ్రామంలోకి రావడంతో యువకులు అప్రమత్తమయ్యారు. గ్రామం నలువైపులా వారిని పట్టుకునేందుకు వెంబడించినా దొరకలేదు. తన వద్దకు మోటారు సైకిళ్లపై వచ్చారని చంటి తెలిపాడు. పోలీసులు దర్యాప్తు చేసి న్యాయం చేయాలని కోరుతున్నాడు. ఈ తరహా ఘటనలు గ్రామాల్లో ఇటీవల ఎక్కువైనట్టు ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

గోదావరి వరదలకు ముందస్తు చర్యలు

తహసీల్దార్ శేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఎటపాక: గోదావరికి వరదల సమయం అయినందున ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ శేఖర్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆయన వివరాలు వెల్లడించారు. వరద భద్రాచలం వద్ద 49 అడుగులకు చేరితే మండలంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయన్నారు. 63 అడుగులకు చేరితే మండలంలో 45 గ్రామాలు ముంపునకు గురవుతాయని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా పది చోట్ల బోటు పాయింట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూడు నెలలకు సరిపడ బియ్యం, ఇతర సరుకులు నిల్వలకు 13 బఫర్ స్టాక్ పాయింట్లు, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రజలకు అన్ని విధాలా సహాయ, సహకారాలు అందించేందుకు సెక్టార్ అధికారిగా తహసీల్దార్, మొబైల్ అధికారిగా ఎంపీడీవో ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారులతో జోనల్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు సర్పంచ్ ఆధ్వర్యంలో కమిటీలు నియమించినట్లు చెప్పారు. వరదల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్యపై మంత్రికి వినతి



మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొయ్యూరు: విశాఖలోని రాష్ట్ర ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్‌ను మండల బీజేపీ నాయకులు మురుకుర్తి అప్పలరాజు, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు అరిమెట రాజు, ఉపాధ్యక్షుడు చంద్రరావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని మండలంలోని ఆడాకుల, ఆర్.కొత్తూరు, కంఠారం, బాలారం, బకులూరు, కొమ్మిక పంచాయతీల్లో నెలకొన్న ఫ్లోరైడ్ సమస్యను వివరించి, వినతిపత్రాన్ని అందజేశారు. గొలుగొండ మండల బీజేపీ అధ్యక్షుడు గౌరినాయుడు తదితరులున్నారు.

యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'పేకమేడలు'


- సందడి చేసిన చిత్ర యూనిట్

డాబాగార్డెన్స్: పేకమేడలు సినిమా యూనిట్ విశాఖలో సందడి చేసింది. నా పేరు శివ ఫేమ్ వినోద్ కిషన్ హీరోగా, అనూష కృష్ణ హీరోయిన్‌గా, నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేష్ వర్రె నిర్మాణంలో యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా చిత్రం రూపుదిద్దుకుందని చిత్ర యూనిట్ తెలిపింది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా సోమవారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ ఈ సినిమా ఈ నెల 19న విడుదల కానుందని చెప్పారు. స్మారన్ మంచి సంగీతం అందించారని, సినిమా బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగా ఇచ్చారన్నారు. తనకు హీరోగా ఇది తొలిసినిమా అని, ఈ సినిమా తప్పకుండా విజయవంతమవుతుందన్న నమ్మకం ఉందన్నారు. హీరోయిన్ అనూషకృష్ణ మాట్లాడుతూ తనకు తెలుగులో ఇది తొలి చిత్రమని, గతంలో కన్నడ సినిమాలు చేశానన్నారు. సింహాచలం స్వామి ఆశీస్సులు తీసుకున్నామని, సినిమా తప్పకుండా విజయవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్మాత రాకేష్ వర్రే పాల్గొన్నారు.

తుది విడత చందనం అరగదీత

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం నుంచి తుది విడత చందనం అరగదీత(ఆఖరి విడత) ఘనంగా ప్రారంభమైంది. ఈనెల 21న ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఆరోజు స్వామికి సమర్పించేందుకు అవసరమైన మూడు మణుగుల పచ్చిచందనం(120కిలోలు) అరగదీత చేపట్టారు.

వాగుల్లో గల్లంతైన వ్యక్తుల మృతదేహాలు లభ్యం



సోకులేరులో గల్లంతైన యువకుడి మృతదేహం



నెల్లిపూడి వాగులో లభ్యమైన మోహనరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

గంగవరం: నెల్లిపూడి వాగులో శనివారం గల్లంతైన వ్యక్తి లోతా మోహనరావు (48) మృతదేహం భయ్యనపల్లి సమీపంలోని వాగు పొదల్లో లభ్యమైనట్టు ఎస్ఐ బి.రామకృష్ణ సోమవారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. గంగవరం మండలం గొరగొమ్మి గ్రామానికి చెందినలోతా మోహనరావు (48) కొత్తపల్లి వైపు నుంచి బైక్‌పై వస్తూ ప్రమాదవశాత్తు నెల్లిపూడి వంతెన వద్ద వాగులో గల్లంతయ్యాడు. పోలీసు, రెవెన్యూ సిబ్బంది, గొరగుమ్మి, నెల్లిపూడి, గార్లపాడు గ్రామస్తులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం ఉదయం మృతదేహాన్ని కనుగొన్నారు. మృతదేహాన్ని అడ్డతీగల ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వీఆర్వో అప్పలకొండ, ఏఆర్ఏ భాస్కరరావు , పోలీసు , రెవెన్యూ సిబ్బంది గాలిరపు చర్యల్లో మూడు రోజులుగా పాల్గొన్నారు.

సోకులేరులో ...

మోతుగూడెం: చింతూరు మండలం సోకులేరు వాగు వద్ద శనివారం గల్లంతైన విజయవాడకు చెందిన అల్లూరి తేజ (24) మృతదేహం సోమవారం లభ్యమైంది. మోతుగూడెం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగిస్తామని ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.